సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం । 10 । జనవరి । 2025



జల విహారం షురూ..
అశ్వాపురంలోని తుమ్మల చెరువులో జల విహారం మొదలైంది. ఎమ్మెల్యే పాయం బోటింగ్‌ను ప్రారంభించారు. 8లో



కళాశాల విస్తరణకు ప్రతిపాదనలు
పాల్వంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల విస్తరణకు రూ.2.20 కోట్ల అంచనాతో ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు అందించారు. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 15°

వాతావరణం
జిల్లాలో శుక్రవారం ఎండ తీవ్రత అధికంగానే ఉంటుంది. తెల్లవారుజామున, రాత్రి వేళల్లో చలి ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం నివేదన, హారతి, మంత్రపుష్పం సమర్పించారు. కార్యక్రమంలో వేదపండితులు పద్మనాభ శర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ తదితరులు పాల్గొన్నారు. కాగా, పెద్దమ్మతల్లి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఈనెల 13న చండీ హోమం నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు. పూజలో పాల్గొనదలచిన భక్తులు రూ.2,516 చెల్లించి గోత్రనామాలు నమోదు చేసుకోవాలని, వివరాలకు 63034 08458 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

స్వామివారికి పట్టువస్త్రాలు అందజేత



ఆలయ ఈఓకు పట్టువస్త్రాలు అందజేస్తున్న తహసీల్దార్

భద్రాచలం: శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనం సందర్భంగా స్వామివారికి అలంకరించేందుకు భద్రాచలం రెవెన్యూ అధికారులు పట్టువస్త్రాలను గురువారం అందజేశారు. దేవస్థాన ఆలయ నిర్మాత, నాటి తహసీల్దార్ భక్త రామదాసు పాటించిన ఆనాటి ఆనవాయితీని కొనసాగిస్తూ ప్రతి ఏడాది రెవెన్యూ అధికారులు పట్టువస్త్రాలను అందజేస్తుంటారు. ఈ క్రమంలో భద్రాచలం తహసీల్దార్ శ్రీనివాస్ ఆలయ ఈఓ రమాదేవికి గురువారం పట్టువస్త్రాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మంత్రి తుమ్మల పర్యటన

దమ్మపేట: మండల పరిధిలోని కటుకూరు, పూసుకుంట గ్రామాల్లో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం పర్యటించనున్నారని క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కటుకూరులో మూడు హైలెవల్ వంతెనలు, బీటీ రోడ్డుకు శంకుస్థాపన, పూసుకుంటలో పామాయిల్ మొక్కల సాగును ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

జాబ్‌మేళాలో 31 మందికి ఉద్యోగాలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాకు 43 మంది హాజరు కాగా, వారిలో 31 మంది ఎంపికయ్యారని జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి కొండపల్లి శ్రీరామ్ తెలిపారు. కేఎల్‌ఆర్ గ్రూప్‌లో ప్యాకింగ్, లోడింగ్, అన్ లోడింగ్ పనుల నిర్వహణకు ఎస్సెస్సీ, ఇంటర్ చదివి 18 నుంచి 35 సంవత్సరాల వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు.

విధుల్లో నిర్లక్ష్యంపై డీసీసీబీ ఉద్యోగులకు మెమోలు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) పరిధిలోని ఓ బ్రాంచ్ ఉద్యోగులు విధుల్లో నిబంధనలు ఉల్లంఘించిన వ్యవహారం వెలుగుచూసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం బ్రాంచ్‌లో ఉన్నతాధికారులు ఇటీవల ఆర్థిక లావాదేవీలపై ఆడిట్ జరిపించగా పలు తప్పిదాలు బయటపడ్డాయి. దీంతో బాధ్యుడైన ఉద్యోగికి తేడా సరిచేసేందుకు అవకాశం కల్పించగా ఆయన సర్దుబాటు చేశారు. ఆయనతో పాటు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇంకో ఇద్దరికి కలిపి మెమోలు జారీ చేశారు. ఈ మెమోలకు వారు ఇచ్చే జవాబు ఆధారంగా చర్యలు తీసుకునున్నారు. కాగా, ఆర్థిక లావాదేవీల అంశం కావడంతో ఓ ఉద్యోగిని సస్పెండ్‌చేసే అవకాశముందని తెలిసింది. ఈ వ్యవహారంపై బ్యాంకు సీఈఓ వెంకటఆదిత్యను గురువారం వివరణ కోరగా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తేలడంతో ఉద్యోగులకు మెమోలు జారీ చేశామని తెలిపారు.





గోదావరి నదిలో హంసవాహనంపై విహరిస్తున్న శ్రీ సీతారామచంద్రస్వామి వారు





తెప్పోత్సవాన్ని తిలకించేందుకు భారీగా హాజరైన భక్తులు

అలలపై నా స్వామి!

భద్రగిరిలో వైభవంగా తెప్పోత్సవం
- ఊరేగింపుగా గోదావరి తీరానికి రామయ్య
- వేదమంత్రోచ్ఛరణలతో హంస వాహనంలో వేంచేపు
- సాయంత్రం 6–01 గంటలకు మొదలైన వేడుక
- గంటపాటు కొనసాగిన జలవిహారం
- గోదావరి తీరానికి పోటెత్తిన భక్తులు

వేద పండితుల మంత్రోచ్ఛరణలు, భక్త జనుల జయజయ ధ్వానాల నడుమ సీతాలక్ష్మణ సమేతుడైన రామచంద్రస్వామి గోదావరిలో జల విహారం చేశారు. రాములోరి నదీ విహారంతో గోదావరి తల్లి పులకించగా ఈ దృశ్యాలను చూస్తూ భక్తులు రామనామ స్మరణ చేశారు. దీంతో భద్రగిరి క్షేత్రం ఆధ్యాత్మిక శోభతో నిండిపోయింది. భద్రాచలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం పవిత్ర గోదావరి నదిలో తెప్పోత్సవం కనుల పండువగా సాగింది.

– భద్రాచలం

దర్బార్ సేవ అనంతరం..

పగల్ పత్తు ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తుల వద్ద విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. ఉదయం సేవాకాలం, తిరుమంగై ఆళ్వార్ పరమపదోత్సవం జరిపించారు. మధ్యాహ్నం రాజభోగం, శాత్తుమురై, పూర్ణ శరణాగతితో పగల్ పత్తు వేడుక ముగిసింది. గర్భగుడిలో ప్రభుత్వోత్సవం(దర్బార్ సేవ) నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాలు, భక్తుల జయజయధ్వానాల నడుమ స్వామివారిని ఊరేగింపుగా గోదావరి తీరానికి తీసుకెళ్లారు. పల్లకీ ముందు పలువురు కోలాటమాడుతుండగా, స్వామి వారిని దర్శించుకునేందుకు దారి పొడవునా భక్తులు బారులుదీరారు. గోదావరి తీరానికి చేరాక అర్చకులు పుణ్యజలాలతో హంస వాహనాన్ని సంప్రోక్షణ చేశారు. ఆ తర్వాత స్వామి వారిని హంసవాహనంలో ఏర్పాటు చేసిన పచ్చిపూల మండపంలో తూర్పు ముఖంగా వేంచేపు చేశారు. ఈ సందర్భంగా వేదపండితులు చతుర్వేదాలు, నాళాయిర దివ్య ప్రబంధం, పంచసూత్రాలు, స్తోత్రాలు పఠించారు. అనంతరం మంగళహారతి, చక్రపొంగలి నివేదనతో పాటు సుమారు గంట పాటు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చివరగా హారతి ఇచ్చి దర్శనానికి అనుమతి ఇచ్చారు.

ఉత్తర ముఖంగా..

ఆగమ శాస్త్ర పూజాదికాలు పూర్తయ్యాక సాయంత్రం 6–07 గంటల సమయంలో ఉత్తర ముఖంగా గోదావరి నదిలో హంస వాహనం కదిలింది. విద్యుద్దీప కాంతులతో ధగధగా మెరుస్తున్న హంస వాహనం, అందులో ఆశీనులైన సీతారాములను చూసేందుకు భక్తులు పోటీ పడ్డారు. తెప్పోత్సవం మొదలైన వెంటనే నదికి ఆవలి తీరంలో బాణసంచా కాల్చడం ప్రారంభమైంది. ఒక్కో పరిక్రమణానికి సగటున 10 నిమిషాల సమయం పట్టింది. మొత్తంగా ఆరు పరిక్రమణాలు రాత్రి 7–01 గంటలకు పూర్తయ్యాయి. తెప్పోత్సవం ముగిసిన అనంతరం సీతారాములను తిరిగి ఆలయానికి తీసుకొచ్చారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

తెప్పోత్సవాన్ని పురస్కరించుకుని గోదావరి తీరంలో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. ఏరు ఉత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ వేదికపై శాస్త్రీయ, గిరిజన సంప్రదాయ నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. తెప్పోత్సవానికి పల్లకీలో స్వామి వారు వెళ్లే సమయంలో పల్లకీ ముందు వివిధ కోలాట సంస్థల ఆధ్వర్యంలో మహిళలు చేసిన ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పురుషోత్తపట్నం నుంచి వచ్చిన మహిళల బృందం చేసిన డప్పు నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

కట్టుదిట్టమైన భద్రత..

తెప్పోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్పీ రోహిత్‌రాజ్ పర్యవేక్షించి సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, గృహనిర్మాణ శాఖ ఎండీ వీ.పీ.గౌతమ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సతీమణి మాధురి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ తదితరులు హాజరయ్యారు.

నేడు ఉత్తర ద్వార దర్శనం

- బ్రహ్మ ముహూర్తంలో ప్రారంభం కానున్న పూజాదికాలు
- రెండు గంటలకు పైగా రామయ్యకు ప్రత్యేక పూజలు

ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం తెల్లవారుజామున శ్రీ సీతారామచంద్రస్వామి వారు భక్తులకు ఉత్తర ద్వారంలో దర్శనమివ్వనున్నారు. ఏడాదిలో ఒక్కసారి మాత్రమే జరిగే ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు ఇప్పటికే భద్రగిరికి పోటెత్తారు.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

వేద మంత్రాల నడుమ..

ముక్కోటి ఏకాదశి రోజున బ్రహ్మ ముహూర్తంలో ప్రత్యేక వాహనంపై ఆశీనులైన లక్ష్మణ సమేత సీతారాములను ఉత్తర ద్వారం దగ్గర కొలువుదీరుస్తారు. వైకుంఠ ఏకాదశి వైభవం, మంగళ వాద్యఘంట, వేద పారాయణం అనంతరం.. వినతాసుత వాహన కీర్తన నాదస్వరం, ఆరాధన, శ్రీరామ షడాక్షరి మంత్ర సంపుటిత అష్టోత్తర శతనామార్చన వంటి పూజాదికాలు నిర్వహిస్తారు. ఉత్తర ద్వార దర్శన ప్రాశస్త్యాన్ని స్థానాచార్యులు స్థలశాయి వివరిస్తారు. ఆ తర్వాత 108 ఒత్తులతో హారతినిస్తూ శరణాగతి గద్య విన్నపం చేపడతారు. చివరగా కోదండపాణి కీర్తన ఆలపిస్తూ వైకుంఠ ద్వారం తెరిచి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు.

పూజా విశేషాలు ఇలా..

- తెల్లవారు జామున 3 నుంచి 4–30 గంటల వరకు సంగీత కళాకారులు, దేవస్థానం హరిదాసులచే కీర్తనాలాపనలు
- 4–30 నుంచి 5 గంటల వరకు వైకుంఠ ఏకాదశి వైభవం
- 5 నుంచి 5–30 గంటల వరకు వివిధ మంగళ వాయిద్యాలు, వేదపారాయణం, వినతాసుత వాహన కీర్తన నాదస్వరం, శ్రీరామ షడాక్షరి మంత్ర సంపుటిత అష్టోత్తర శతనామార్చన
- ఉదయం 5.30 నుంచి 5–40 వరకు ఉత్తర ద్వార దర్శన విశిష్టత వివరణ, 108 ఒత్తులతో హారతి, శరణాగతి గద్యవిన్నపం
- 6గంటలకు ఉత్తర ద్వారాలు నెమ్మదిగా తెరుచుకుంటుండగా ధూపాన్ని చీల్చుకుంటూ హారతి వెలుగులు.. ఆ తర్వాత లక్ష్మణ సమేత సీతారాముల వారి దర్శనం

పారాలీగల్ వలంటీర్ల బాధ్యత కీలకం

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి



మాట్లాడుతున్న భానుమతి

కొత్తగూడెంటౌన్: సమాజంలో పారా లీగల్ వలంటీర్ల బాధ్యత కీలకమైందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి అన్నారు. వలంటీర్లకు రెండు రోజులుగా జిల్లా కోర్టులో శిక్షణ తరగతులు నిర్వహించగా, గురువారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని వృద్ధాశ్రమాలు, మానసిక వికాస కేంద్రాల్లో మెడికల్ క్లినిక్‌లు ఏర్పాటు చేయాలని, వైద్య, న్యాయపరంగా ఏమైనా సమస్యలుంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రతీ పేదవాడికి న్యాయం జరిగేలా వలంటీర్లు వారధిగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి.పురుషోత్తమరావు, డిప్యూటీ కౌన్సిల్ పి.నిరంజన్ రావు, న్యాయవాదులు జి.రామచంద్రారెడ్డి, మారపాక రమేష్, షాజహాన్ పర్వీన్, జి.సునంద, మెండు రాజమల్లు, అసిస్టెంట్ డిఫెన్స్ కౌన్సిల్స్ జి.నాగస్రవంతి, జ్యోతి, విశ్వకర్మ, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇదేం పద్ధతి ‘గురూ..!’

- రూ.2 వేలు లంచం తీసుకుంటూ చిక్కిన గురుకులం ప్రిన్సిపాల్
- ఆయనతో పాటు అటెండర్ కూడా..



ఏసీబీకి పట్టుబడిన ప్రిన్సిపాల్ కృష్ణ, అటెండర్ రామకృష్ణ

ఇల్లెందు: వేతన బకాయి ఇప్పించాలని కోరిన గెస్ట్ టీచర్ నుంచి రూ.2 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడో ఓ మైనారిటీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్. ఈ పాపంలో అటెండర్‌ను కూడా భాగస్వామిని చేశాడు. వివరాలిలా.. ఇల్లెందులోని మైనారిటీ గురుకుల(బాలుర) కళాశాలలో సంధ్యారాణి గెస్ట్ టీచర్‌గా పని చేస్తున్నారు. కొన్ని నెలలుగా పెండింగ్ ఉన్న జీతం ఇప్పించాలని ప్రిన్సిపాల్ భీమనపల్లి కృష్ణను కోరారు. అయితే తనకు రూ.2వేలు లంచం ఇవ్వాలని, లేకుంటే వేతనం నిలిపివేయిస్తానని ఆయన బెదిరించాడు. ప్రిన్సిపాల్ వేధింపులు తట్టుకోలేని సంధ్యారాణి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. దీంతో ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ ఆధ్వర్యంలో అధికారులు రంగంలోకి దిగారు.

నిర్ణీత సమయాని కంటే ముందే రావాలని..

రూ.2 వేలు ఇస్తానని సంధ్యారాణి ప్రిన్సిపాల్‌ను కలవగా.. గురువారం రోజున నిర్ణీత సమయానికి ముందే పాఠశాలకు రావాలని, తాను కూడా వస్తానని ప్రిన్సిపాల్ కృష్ణ చెప్పాడు. దీంతో సంధ్యారాణి ప్రార్థన సమయానికి ముందే పాఠశాలకు చేరుకున్నారు. అప్పటికే కృష్ణ వచ్చి తన సీటులో కూర్చోగా టీచర్ వెళ్లి రూ.2 వేలు ఇవ్వబోయారు. అయితే సీసీ కెమెరాలు ఉన్నందున తాను నేరుగా తీసుకోనని, అటెండర్ చిచ్చెల్ల రామకృష్ణకు ఇవ్వాలని సూచించాడు. దీంతో సంధ్యారాణి బయటకు వచ్చి రామకృష్ణకు నగదు ముట్టజెప్పగా అతడు వెళ్లి ప్రిన్సిపాల్‌కు అందించాడు. ఈ క్రమాన ముందస్తు పథకం ప్రకారం అక్కడికి చేరుకున్న ఏసీబీ అధికారులు ఇద్దరినీ రెడ్‌హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.

అందరూ బాధితులే..!

మైనారిటీ గురుకుల పాఠశాలలో నిత్యం విజిలెన్స్ తనిఖీలు ఉంటాయి. అయినా ప్రిన్సిపాల్ మాత్రం ఉద్యోగులందరినీ వేధిస్తుంటాడని చెప్పుకుంటున్నారు. చివరకు ఆయన వేధింపుల తట్టుకోలేక సంధ్యారాణి ఏసీబీని ఆశ్రయించారు. అయితే నిత్యం తనిఖీలు చేసే విజిలెన్స్ అధికారులకు ఇది కంట పడకపోగా, ఏసీబీకి చిక్కడం గమనార్హం. కాగా, కృష్ణ ఏసీబీకి చిక్కాడనే సమాచారం తెలియగానే ఆర్‌ఎల్‌సీ అరుణకుమారి గురుకుల పాఠశాలకు వచ్చి, సీనియర్ ఉపాధ్యాయుడికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

పాండిచ్చేరికి ఉపాధ్యాయుడి టీఎల్‌ఎం

మణుగూరు టౌన్: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పరమయ్య తయారు చేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ త్వరలో పాండిచ్చేరిలో జరగబోయే సౌత్ ఇండియా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైంది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి బాలవైజ్ఞానిక్ ప్రదర్శనలో గురువారం టీఎల్‌ఎం ప్రదర్శించారు. 33 జిల్లాల నుంచి 48 ఎగ్జిబిట్లు రాగా పరమయ్య తయారు చేసిన టీఎల్‌ఎం మూడో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా అతిథుల నుంచి అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌లో ప్రతిభ

మణుగూరు రూరల్ : రాష్ట్రస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనలో మణుగూరు ఎక్స్‌లెంట్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనా జాతీయ స్థాయికి ఎంపికైంది. యాజమాన్యం రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ అవార్డ్ అందుకుంది. విద్యాసంస్థల చైర్మన్ ఎండీ యూసఫ్ షరీఫ్, కరస్పాండెంట్ ఖాదర్, డైరెక్టర్ యాకుబ్ షరీఫ్, వెంకట్‌లు హర్షం వ్యక్తం చేశారు. నమూనా తయారు చేసిన విద్యార్థులను అభినందించారు.



జడ్చర్ల ఎమ్మెల్యే నుంచి మెమెంటో అందుకుంటున్న ప్రణీత్, సారలమ్మ



అవార్డు అందుకుంటున్న పరమయ్య



అవార్డు అందుకుంటున్న ఎక్స్‌లెంట్ యాజమాన్యం

సౌత్ ఇండియా పోటీలకు ఎంపిక

ములకలపల్లి : మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన ఇసుకుర్తి ప్రణీత్ సౌత్ ఇండియా లెవల్ విద్యా వైజ్ఞానిక పోటీలకు ఎంపికయ్యాడు. రాష్ట్రస్థాయిలో పోటీల్లో ప్రథమ స్థానం కైవసం చేసుకున్న ప్రణీత్ సౌత్ ఇండియా లెవల్ పోటీల్లో స్థానం దక్కించుకున్నాడు. జడ్చర్లలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి పోటీలకు రాష్ట్రంలోని వివిధ పాఠశాలల నుంచి 517 స్టాళ్లు ఏర్పాటు చేయగా.. నేచురల్ ఫామింగ్ (సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం) విభాగంలో ప్రణీత్ మొదటి స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి చేతుల మీదుగా ప్రణీత్, గైడ్ టీచర్ మందారి సారలమ్మ మెమెంటో, ప్రశంసాపత్రం అందుకున్నారు. ప్రణీత్‌ను హెచ్‌ఎం వెంకటనర్సమ్మ అభినందించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

డీఈఓ వెంకటేశ్వరాచారి



మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరా చారి

పినపాక/మణుగూరురూరల్/కరకగూడెం : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని డీఈఓ వెంకటేశ్వరాచారి అధికారులను ఆదేశించారు. పినకపా, మణుగూరు, కరకగూడెం మండలాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్య, భోజనం విషయంలో రాజీ పడొద్దని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెంపొందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వారిలో దాగి ఉన్న సామర్థ్యాలను గుర్తించి వెలికితీయాలన్నారు. విద్యార్థుల అపార్ ఐడీ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఐడీ అప్‌డేట్‌లో జిల్లాను ముందు స్థానంలో నిలపాలని పిలుపునిచ్చారు. పినపాక మండలానికి మంజూరైన నవోదయ పాఠశాలకు తాత్కాలిక వసతి కల్పించేందుకు కరకగూడెం పాఠశాలను పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా సమన్వయకర్త ఎస్.సతీష్ కుమార్, అసిస్టెంట్ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్, ఎంఈఓ గడ్డం మంజుల, హెచ్‌ఎం నాగశ్రీ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీలత, బ్రహ్మయ్య, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



ఇల్లెందులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ఇల్లెందు/ఇల్లెందురూరల్/టేకులపల్లి/గుండాల : ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. గురువారం ఆయన ఇల్లెందు, టేకులపల్లి, గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డీఏలు విడుదల చేయాలని, సీఆర్‌టీలకు, ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేయాలని కోరారు. అన్ని గురుకుల పాఠశాలల్లో రెండు డిప్యూటీ వార్డెన్ పోస్టులు మంజూరు చేయాలన్నారు. ఉపాధ్యాయులు తమ మొదటి ప్రాధాన్యత ఓటును తనకు వేసి మరోసారి ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. తాను విజయం సాధిస్తే జీఓ 317 బాధిత ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి పాటుపడతానని హామీ ఇచ్చారు. గిరిజన సంక్షేమ శాఖలో పండిట్, పీఈటీ అప్‌గ్రేడ్ సమస్యకు పరిష్కారం చూపిస్తానన్నారు. ఆయా కార్యక్రమాల్లో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కార్యదర్శులు పి.జయరాజు, హతీరామ్, ఇల్లెందు మండల అధ్యక్ష కార్యదర్శులు రాంబాబు, వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు కృష్ణవేణి, కోశాధికారి అన్నపూర్ణ, పి.బాలస్వామి, రూప్‌సింగ్, సురేష్, బాలోజీ, వాసం వరలక్ష్మి, కిషోర్‌సింగ్, మాన్సింగ్, హరికుమార్, వీరన్న, రవి, గురుప్రసాద్, లక్ష్మణ్, మంజిలాల్, సునీత, కృష్ణకుమారి, ముత్తు బాయమ్మ, దీప, వెంకటరెడ్డి, లక్ష్మయ్య, మురళీ, బాలు పాల్గొన్నారు.

సంగారెడ్డి నుంచి భద్రాచలానికి..

కాలినడకన వస్తున్న భక్తులు

పాల్వంచ: ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీసీతారామచంద్రస్వామి వారిని దర్శించుకునేందుకు సంగారెడ్డి జిల్లా నుంచి కాలినడక భద్రాచలానికి పలువురు భక్తులు వచ్చారు. సంగారెడ్డి జిల్లా దెగుల్‌వాడి గ్రామానికి చెందిన పలువురు డిసెంబర్ 31న పాదయాత్రగా బయలుదేరి గురువారం భద్రాచలం చేరుకున్నారు. ఈ సందర్భంగా పాల్వంచలో వారిని ‘సాక్షి’ పలుకరించగా శ్రీరాముడి పరమ భక్తులైన తాము శ్రీరామ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి ఏటా కాలినడకన భద్రాచలం వచ్చి వైకుంఠ ఏకాదశి రోజున స్వామి వారిని దర్శించుకుంటామని సమితి సభ్యులు అంబుదాచారి తెలిపారు.

భక్తులకు ముక్కోటి సేవలు

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని భద్రాచలంలో శ్రీసీతారామ చంద్ర స్వామివారు శుక్రవారం తెల్లవారుజామున ఉత్తర ద్వార దర్శనం ఇవ్వనున్నారు. గురువారం రాత్రి గోదావరిలో హంస వాహనంపై విహరించారు. తెప్పోత్సవాన్ని కనులారా వీక్షించిన భక్తులు తన్మయత్వం పొందారు. వేడుకలకు పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరాగా.. ఇబ్బందులు పడకుండా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సేవలు అందించారు. -భద్రాచలంఅర్బన్



భద్రాచలం వద్ద గోదావరిలో శ్రీసీతారామ చంద్రస్వామివారి తెప్పోత్సవాన్ని వీక్షిస్తున్న భక్తజనులు

తెప్పోత్సవం.. ప్రశాంత వీక్షణం

భద్రాచలంటౌన్: ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన రామయ్య జల విహారం(తెప్పోత్సవం) వైభవంగా సాగింది. భక్తులు ఇబ్బందులు పడకుండా ప్రశాంతంగా వేడుకను వీక్షించారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ వేడుకల నిర్వహణ, ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టారు. భక్తులు, పర్యాటకులు రామయ్య జల విహారం వీక్షించేందుకు తీరంవరకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాట్లు చేశారు. ప్రతి ఏటా తెప్పోత్సవానికి ప్రభుత్వం తరఫున వీవీఐపీలు రావడం ఆనవాయితీ. ఈ సారి ఎవరూ రాలేదు. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు కూడా హాజరు కాలేదు. వీవీఐపీల హడావుడి లేకపోవడంతో సామాన్య భక్తులు రామయ్య జలవిహారాన్ని సమీపం నుంచి వీక్షించారు. తెప్పోత్సవ దృశ్యాలను సెల్‌ఫోన్లలో బంధించారు. కాగా వీవీఐపీలు, వీఐపీల పాసుల జారీలో కొంత జాప్యం జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి.

తిరుపతి ఘటనతో ప్రత్యేక బందోబస్తు



వేడుక అనంతరం వెనుదిరిగిన భక్తులు

పోలీసు ఉన్నతాధికారులు పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టారు. ప్రతి ఏటా తెప్పోత్సవం ముగియకముందే పోలీసులు ట్రాఫిక్‌ను గాలికొదిలేసి వెళ్లేవారు. ఈసారి మాత్రం ఎస్పీ రోహిత్‌రాజు చొరవ తీసుకోవడంతోపాటు పక్క రాష్ట్రం ఏపీలోని తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనతో అప్రమత్తమై కఠినమైన హెచ్చరికలు జారీ చేశారు. దీంతో పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించారు. సాయంత్రం నాలుగు గంటల నుంచే వాహనాలను రామాలయం దారిలోకి వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. చాలా దూరంలోనే వాహనాలు నిలిపి భక్తులు నడుచుకుంటూ వెళ్లారు. తెప్పోత్సవం ముగిశాక భక్తులను ఆలయ దారుల నుంచి దశల వారీగా విడిచి పెట్టడంతో ప్రధాన రాహదారిపై ట్రాఫిక్ జామ్ ఏర్పడలేదు. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు తీసుకున్న చర్యలను భక్తులు ప్రశంసించారు.

ఆరు ప్రథమ చికిత్సా కేంద్రాలు



భద్రాచలం బ్రిడ్జి పాయింట్‌లో ప్రథమ చికిత్సా కేంద్రం..

వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో భద్రాచలం పట్టణంలో ఆరు ప్రథమ చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేశారు. బ్రిడ్జి సెంటర్‌లో, అంజనేయ స్వామి ఆలయం సమీపంలో, ఆర్టీసీ బస్టాండ్, గోదావరి ఘాట్, తానీషా కల్యాణ మండపం, ఆలయ ప్రాంగణం, సాధువుల మండపం వద్ద కేంద్రాలను ఏర్పాటు చేశామని వైద్యాధికారులు తెలిపారు.

ఫ్లెక్సీలతో సమాచారం



కరకట్ట ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

భక్తులకు ఉపయోగపడే సమాచారంతో పోలీస్ శాఖ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసింది. పట్టణంలో రూట్ మ్యాప్, ఏ ప్రదేశంలో ఏ వాహనాలు పార్కింగ్ చేయాలి? వాహనాలను ఎక్కడవరకు అనుమతిస్తారు? ఎక్కడెక్కడ బారికేడ్లు ఏర్పాటు చేశారు? ప్రసాదం కౌంటర్ల వివరాలను ఫ్లెక్సీల్లో పొందుపరిచారు. పోలీస్ కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు కూడా వాటిలో పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్లలో సందడి



కొత్తగూడెం బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

చుంచుపల్లి: ముక్కోటి ఏకాదశి సందర్భంగా భద్రాచలం వెళ్లే ప్రయాణికుల సంఖ్య గురువారం ఉదయం నుంచి పెరిగింది. గురువారం తెప్పోత్సవ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా తిలకించేందుకు భక్తులు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ఆర్టీసీ బస్సుల్లో తరలి వెళ్లారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు రావడంతో ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాల్లో సందడి నెలకొంది.

ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని భద్రాచలం నుంచి కొత్తగూడెం వరకు 20 అదనపు సర్వీసులు నడిపిస్తున్నట్లు భద్రాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ తిరుపతి తెలిపారు. జిల్లాలోని కొత్తగూడెం, మణుగూరు నుంచి భద్రాచలానికి 10 సర్వీసులు, ఖమ్మం నుంచి భద్రాచలానికి ఐదు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆర్టీసీలో మహిళలకు ప్రయాణం ఉచితం కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి మహిళా భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందుకు అనుగుణంగానే పలు రూట్లలో బస్సుల సంఖ్యను పెంచుతున్నట్లు డీఎం తెలిపారు.

ఆన్‌లైన్‌లో టికెట్లు 'సోల్డ్ అవుట్'

భద్రాచలం: ముక్కోటి ఏకాదశికి దేవస్థానం తరఫున వెబ్‌సైట్‌లో ఉంచిన ఆన్‌లైన్ టికెట్లు ఈ ఏడాది దాదాపు పూర్తిస్థాయిలో అమ్ముడు పోయాయి. రూ.2 వేల ధర కలిగిన వీవీపీ సెక్టార్ టికెట్లు 421, రూ.వెయ్యి విలువ గల 215 టికెట్లు పూర్తిగా విక్రయించారు. రూ.500 విలువ గల సెక్టార్‌లో 100 టికెట్లను విక్రయించారు. గురువారం సాయంత్రం వరకు రూ. 500 విలువ గల టికెట్లు బీ సెక్టార్‌లో కేవలం 76, డి సెక్టార్‌లో 26, రూ.250 విలువ గల టికెట్లు 195 మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఈ టికెట్లు శుక్రవారం తెల్లవారుజాము వరకు అమ్ముడు పోయే అవకాశాలు ఉన్నాయని ఆలయ అధికారులు భావిస్తున్నారు.

మీడియా పాస్‌ల దుర్వినియోగం

అక్రిడిటేషన్ జర్నలిస్టులకు దక్కని వైనం

భద్రాచలం : ముక్కోటి సందర్భంగా మీడియాకు జారీ చేసే పాసులు దుర్వినియోగమయ్యాయి. తొలుత 150 పాసులు ఇవ్వాలని నిర్ణయించారు. వివిధ కేటగిరీల వారీగా అక్రిడిటేషన్ జర్నలిస్టులకు వీటిని కేటాయించాల్సి ఉంటుంది. గురువారం ఉదయం 11:30 గంటలకు పాస్‌ల జారీ ప్రక్రియ మొదలైంది. కేవలం గంట సేపు జారీ చేసి ఆ తర్వాత ఆపేశారు. సాయంత్రం మళ్లీ పాస్‌ల జారీ మొదలుపెట్టారు. కేవలం ఐదు, పది నిమిషాల వ్యవధిలోనే పాస్‌లన్నీ అయిపోయాంటూ సమాచార శాఖ తేల్చి చెప్పింది. అప్పటికే ప్రధాన పత్రికలు, టీవీ చానళ్లకు సైతం పాస్‌లు అందలేదు. దీంతో ముక్కోటి విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు ఇచ్చే డ్యూటీ పాస్‌లను అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు కేటాయించారు. ఇవి కూడా కొందరికే దక్కాయి. చాలా మందికి పాస్‌లు లేవు.

నిఘా ఏదీ

మావోయిస్టు ప్రభావిత ప్రాంతంతగా పేరొందిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ముక్కోటి వంటి జన సమ్మర్థం అధికంగా ఉండే వేడుకల సందర్భంగా మీడియా పాస్‌లు ఇష్టారీతిగా జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ గుర్తింపు కార్డు లేని వ్యక్తులకు ఏ ప్రతిపాదికన నాలుగైదు పాస్‌లు ఎలా కేటాయించారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మరోవైపు మీడియా పాస్‌లను బ్లాక్‌మార్కెట్‌లో అమ్మకానికి పెట్టారని అందువల్లే అక్రిడిటేషన్ కార్డు లేని వ్యక్తులకే ఎక్కువగా పాస్‌లు దక్కాయనే ఆరోపణలు వస్తున్నాయి.

వీఐపీ పాస్‌ల రద్దీ

ఉత్తర ద్వారంలో వైకుంఠ రాముడిని దర్శించుకునేందుకు భక్తులు వివిధ ప్రాంతాల నుంచి భద్రాచలం వస్తున్నారు. ఇలా వచ్చే భక్తుల కోసం దేవస్థానం సెక్టార్ల వారీగా విభజించి రూ.2000, రూ.1000, రూ.500, రూ 250 టికెట్లను విక్రయిస్తోంది. ఉచితంగాను భక్తుల ఉత్తర ద్వార దర్శనం చేసుకోవచ్చు. వీఐపీ, వీవీఐపీ సెక్టార్లలో ఉండే వారికే ఉత్తర ద్వారంలో సీతారాముల దర్శనం చక్కగాజరుగుతుంది. వీరి తర్వాతే టికెట్ కొనుక్కునే భక్తుల సెక్టార్లు ఉంటాయి. అయితే వీఐపీ, వీవీఐపీ గ్యాలరీల్లోకి విపరీతంగా పాస్‌లు జారీ చేయడం విమర్శలకు తావిస్తోంది. మంత్రులకు 30, కార్పొరేషన్ చైర్మన్లకు 10, ఎమెల్యేలు, ఎంపీలు తదితర ప్రజాప్రతినిధుల కోటాలో రెండు వందలకు పైగా పాస్‌లు జారీ అయ్యాయి. దీంతో వీఐపీ గ్యాలరీ సామర్థ్యం నిండిపోతుంది. దీంతో అందులో ఉన్న వారే నిలబడి ఉత్తర ద్వార దర్శనం చేసుకునే పరిస్థితి ఉంది. దీంతో టికెట్ కొన్న వారు, సామాన్య భక్తులకు ఇక్కట్లు తప్పేలా లేవు.



పల్లకీసేవ : వేంచేయిస్తున్న శ్రీసీతారామ చంద్రస్వామివారు



రామయ్య సన్నిధి : కలెక్టర్ జితేష్, ఎస్పీ రోహిత్, ఈఓ రమాదేవి చిద్విలాసం



వినుడి వినుడి రామాయణగాథ : కళాకారుల నృత్యరూపకంలో సీతారాముల చరిత



భళా : నృత్యం చేస్తున్న చిన్నారులు



ప్రశాంతం : వేడుకను తిలకిస్తున్న కలెక్టర్ జితేష్, ఎస్పీ రోహిత్, పీఓ రాహుల్, ఎమ్మెల్యే వెంకట్రావు



ఆదివాసీ రుచులు : గిరిజనుల ఉత్పత్తుల అమ్మకానికి ఏర్పాటు చేసిన స్టాళ్లు, ఫుడ్‌కోర్టులు

క్లుప్తంగా

కేఎల్‌ఆర్ కళాశాలకు అటానమస్ హోదా



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కేఎల్‌ఆర్ విద్యాసంస్థల యాజమాన్యం

పాల్వంచ: పాల్వంచలోని కేఎల్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ అటానమస్ హోదా గుర్తింపు లభించిందని కేఎల్‌ఆర్ విద్యాసంస్థల చైర్మన్ కాటిరెడ్డి నాగమణి తెలిపారు. గురువారం కళాశాలలో అటానమస్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే ఐదేళ్లకు ఈ హోదాను ప్రదానం చేశారని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అటానమస్ హోదా, నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ పొందిన ఏకైక విద్యాసంస్థగా కేఎల్‌ఆర్ నిలిచిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాజేంద్ర ప్రసాద్, డైరెక్టర్లు, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ తల్లి హుండీ ఆదాయం రూ.1.81లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఉద్యోగులు

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట మండలం వినాయకపురంలోని శ్రీ చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. దేవాదాయ శాఖ కొత్తగూడెం డివిజన్ పరిశీలకులు పి.బేల్‌సింగ్ ఆధ్వర్యాన లెక్కించగా గతేడాది సెప్టెంబర్ 23నుంచి ఈ నెల 9వ తేదీ వరకు రూ.1,81,558 ఆదాయం నమోదైంది. గత ఏడాది సెప్టెంబర్‌లో రూ.78,958 ఆదాయం రాగా ఈసారి రూ.1,02,600 మేర పెరిగిందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ సూర్య ప్రకాష్, ఆలయ చైర్మన్ సరాల శ్రీను, అర్చకులు ఎం.ప్రసాద్, ఉద్యోగి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,506

తుమ్మల చెరువులో జల విహారం..

బోటింగ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం



తుమ్మల చెరువులో విహరిస్తున్న ఎమ్మెల్యే పాయం తదితరులు

అశ్వాపురం: కాకతీయుల కాలంనాటి తుమ్మల చెరువులో గురువారం జల విహారం ప్రారంభమైంది. బోటింగ్‌ను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించి, అధికారులతో కలిసి సరదాగా బోటు షికారు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్ జితేష్ వి.పాటిల్ చొరవతో రూ.10 లక్షలతో ప్రభుత్వం బోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో సేద తీరుతూ ప్రకృతి అందాలు తిలకించవచ్చని పేర్కొన్నారు. బోటు షికారుకు ఆదరణ పెరిగితే రేగులగండి, పేరంటాల చెరువుల్లో కూడా ఈ సదుపాయం కల్పిస్తామన్నారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల సభ్యులు బోటింగ్ నిర్వహణను సమర్థంగా నిర్వహించాలని, తుమ్మలచెరువు పర్యాటకంగా అభివృద్ధి చెందేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి పరంధామరెడ్డి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగిరెడ్డి యుగంధర్‌రెడ్డి, ఎంపీడీఓ వరప్రసాద్, వ్యవసాయ అధికారి సాయిశంతన్‌కుమార్, పీఆర్ ఏఈ చక్రధరాచారి తదితరులు పాల్గొన్నారు. కాగా, తుమ్మలచెరువు వద్ద బోటింగ్ ప్రారంభించేందుకు ఎమ్మెల్యే వస్తారన్న సమయం వరకు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. ఎంపీడీఓ వరప్రసాద్ వచ్చేసరికి నిర్వహణ బాధ్యతలు తీసుకున్న మహిళా సంఘం వారు రాకపోవడంతో ఆయన పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆపై అప్పటికప్పుడు ఏర్పాట్లు చేయించారు.

స్కల్ బోటు ప్రత్యేకం

తుమ్మలచెరువు వద్ద ప్రత్యేకంగా స్కల్ బోటు ఏర్పాటు చేశారు. హైదరాబాద్ తర్వాత ఈ బోటు ఇక్కడే అందుబాటులోకి తేవడం విశేషం. స్కల్ బోటింగ్‌పై విద్యార్థులు, యువత ఎక్కువగా ఆసక్తి చూపే అవకాశం ఉందని జిల్లా యుజవన, క్రీడల అధికారి పరంధామరెడ్డి తెలిపారు.

హైరిస్క్ పేషెంట్‌కు గర్భసంచి తొలగింపు



మహిళకు శస్త్రచికిత్స నిర్వహిస్తున్న వైద్యులు

కొత్తగూడెంరూరల్: జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రం(ఎంసీహెచ్)లో హైరిస్క్ పేషెంట్‌కు వైద్యులు గర్భసంచి తొలగించారు. సుజాతనగర్‌కు చెందిన వేల్పుల రేణుక అనారోగ్యంతో బాధ పడుతోంది. దీనికితోడు గర్భసంచికి గడ్డలు వచ్చాయి. దీంతో కుటుంబ సభ్యులు ఈ నెల 4న రామవరంలోని ఎంసీహెచ్ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రొఫెసర్ అనుపమ, అసిస్టెంట్ ప్రొఫెసర్ సాగరిక సర్జరీ చేసి గర్భసంచి తొలగించారు. బాధితురాలి అనారోగ్య పరిస్థితి దృష్ట్యా మూత్ర సంచి, పేగులు అతుక్కుని ఉండే అవకాశం ఉంది. దీంతో మరో సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది. కానీ వైద్యులు ఏ సమస్య రాకుండా శస్త్రచికిత్స నిర్వహించారు. ఆరోగ్యం నిలకడగా ఉండటంతో బాధితురాలిని డిశ్చార్జి చేశారు. శస్త్రచికిత్సలో అనస్థీయన్ డాక్టర్ నాగేశ్వరరావు, నర్సింగ్ ఆఫీసర్లు లలిత, ఉమ, సుప్రియ, కాసిరత్నం, అనిల్ బాబు తదితరులు సేవలందించారు.

విజయ డెయిరీ జూనియర్ మేనేజర్‌గా హన్మంతు



అశోక్‌కుమార్, హన్మంతును సన్మానిస్తున్న ఉద్యోగులు

ఖమ్మంవ్యవసాయం: పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ (విజయ డెయిరీ) ఖమ్మం యూనిట్ జూనియర్ మేనేజర్‌గా బి.హన్మంతు గురువారం విధుల్లో చేరారు. కొన్నాళ్ల క్రితం ఇక్కడ ఆరేళ్ల నుంచి పనిచేస్తున్న జూనియర్ మేనేజర్ పి.అశోక్‌కుమార్‌ను వరంగల్‌కు, వరంగల్ నుంచి హన్మంతును ఖమ్మం బదిలీ చేశారు. అయితే, ఖమ్మం యూనిట్ నిర్వహణ దృష్ట్యా అశోక్‌కుమార్‌ను ఇక్కడే కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఆయనను రిలీవ్ చేయగా ఆ స్థానంలో హన్మంతు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారిద్దరిని ఉద్యోగులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డెయిరీ డీడీ పి.మోహన మురళి, మేనేజర్ సిద్దేశ్వర్, ఉద్యోగులు నాగమణి, బాలప్రసాద్, మురళీకృష్ణ, శ్రీలత, రమణకుమార్, అప్పారావు, భాస్కర్, పార్వతి, నాగేశ్వర్‌రావు, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల విస్తరణకు ప్రతిపాదనలు

రూ.2.20 కోట్ల అంచనాతో ప్రహారీ, అదనపు తరగతి గదులు..



కళాశాల పూర్వఅధ్యాపకుడు హరిబాబును సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ తదితరులు

పాల్వంచరూరల్: పాల్వంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల విస్తరణకు రూ. 2.20 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు రూపొందించి ఇంటర్ బోర్డు విద్యాశాఖ కమిషనర్‌కు పంపినట్లు ప్రిన్సిపాల్ పి.శంకర్ తెలిపారు. మండల పరిధిలోని బస్వతారాకకాలనీ గ్రామపంచాయతీలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవాలు ఇటీవల ఘనంగా జరిగాయి. ఈ నేపథ్యంలో గురువారం సహకారం అందించిన కళాశాల పూర్వ అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు, స్వర్ణోత్సవాల కోర్ కమిటీ సభ్యులను సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చరిత్ర కలిగిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ఔన్నత్యాన్ని గుర్తించి అందరూ సహకారం అందించారని పేర్కొన్నారు. కళాశాలకు ప్రహారీ, అదనపు తరగతి గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించినట్లు తెలిపారు. అర్హత కలిగి, అనుభవం ఉన్న లెక్చరర్లు జూనియర్ కళాశాలలో ఉన్నారని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు గోపాలకృష్ణ, నాగేశ్వరరావు, పోచాలరావు, సుధాకర్‌రావు, అంజనాదేవి, అనురాధ దేవి పాల్గొన్నారు.

శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో చోరీ

అశ్వారావుపేటరూరల్: పాత మామిళ్లవారిగూడెం గ్రామ శివారులో ఉన్న కాకతీయుల కాలం నాటి శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో చోరీ జరిగిన విషయం గురువారం వెలుగుచూసింది. ఆలయం గేటును ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించిన దుండగులు హుండీని ఎత్తుకెళ్లి సమీపంలోని వైకుంఠధామంలో పగులగొట్టి సుమారు రూ.40 వేలు అపహరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై టీ యయాతి రాజు తెలిపారు.

40క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

కారేపల్లి: ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 40క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఖమ్మం టాస్క్‌ఫోర్స్, కారేపల్లి పోలీసులు గురువారం సంయుక్తంగా చేపట్టిన తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని పాత చెన్నంగులగడ్డలో ఆవుల సంపత్ ఇంట్లో ఇల్లెందు మండలానికి చెందిన బత్తుల సంతోష్ 40 బియ్యాన్ని నిల్వ చేశాడు. పక్కా సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టి బియ్యాన్ని కారేపల్లి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనలో సంపత్, సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జూలూరుపాడు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డ సంఘటన మండలంలోని పడమటనర్సాపురం గ్రామ సమీపంలో గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలానికి చెందిన తరుణ్, పందిళ్లపల్లికి చెందిన గఫూర్ కొత్తగూడెంలో డిప్లొమా పరీక్ష రాసేందుకు బైక్‌పై వెళుతున్నారు. పడమటనర్సాపురం డబుల్‌బెడ్రూం ఇళ్ల సముదాయం సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ముళ్లపొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో గఫూర్, తరుణ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

చలి తీవ్రతతో యాచకుడు మృతి

బూర్గంపాడు : చలి తీవ్రతతో యాచకుడు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని సారపాకలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం అంజనాపురం గ్రామానికి చెందిన గుగులోత్ బాలు(65) ఎనిమిదేళ్ల క్రితం ఇంటినుంచి వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు వెదికినా ఆచూకీ లభించలేదు. కాగా, బాలు సారపాక చేరుకుని భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆశ్రయం కోసం బుధవారం రాత్రి స్థానిక బస్టాండ్‌కు చేరుకున్న బాలు చలి తట్టుకోలేక మృతిచెందాడు. చలికి బిగుసుకుపోయి ఉండగా గురువారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి ఫొటోను పోలీసులు సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా.. చూసిన కుటుంబసభ్యులు పోలీసులకు ఫోన్ చేశారు. అనంతరం వారు సారపాక చేరుకుని మృతదేహం బాలుదేనని నిర్ధారించుకున్నారు. మృతుడి కుమారుడు సురేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

DVK విద్యా సంస్థలు (AP & TS)
WANTED STAFF
DVK Dr. Forum MBBS (Abroad) Office, ఖమ్మం నందు పని చేయుటకు అనుభవం కలిగిన స్టాఫ్ కావలెను.
Regional Director-01
Office Staff-01 (Computer)
Clerk-01
వివరాలకు సంప్రదించండి :
చైర్మన్: DVK-9492313549
MBBS (Abroad) Office, Khammam.

సాక్షి క్లాసిఫైడ్స్



■ఖమ్మం, సహకార నగర్, లయన్స్ క్లబ్ బిల్డింగ్ నందు కుట్టు మిషన్, బ్యూటీషియన్ & కంప్యూటర్ కోర్స్ నేర్పబడును. ఆసక్తిగల అభ్యర్థులు సం॥ 9848156328 [M-1256031]



BUSINESS OFFER

■కంపెనీ అన్ని రకాల వ్యాపార, ప్రాజెక్ట్‌ల, వ్యక్తిగత, వ్యవసాయ, విద్య రుణాల సలహాలకు సంప్రదించండి DMA స్వాగతం. జీతం + కమీషన్. ✆ 9671637906. [T-297]

■ మీ బంగారం బ్యాంక్‌లో, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9177555694 [SCA25001126]



■Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 20,000 నుండి 25,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1256029]

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :
ఖమ్మం : 9010299957, 9705444182
కొత్తగూడెం : 9010223783
పాల్వంచ : 9705444183
భద్రాచలం : 9951602914
మణుగూరు : 9705944416
సత్తుపల్లి : 9652868642
మధిర : 9949927792

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి
కేవలం రూ. 500/- మాత్రమే
(GST 5% అదనం)

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.